క్లుప్తంగా

సంతలో మంత్రి ఎర్రబెల్లి సందడి



కొడకండ్ల : నిత్యం వివిధ కార్యక్రమాల్లో బిజి బిజీగా గడిపే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం మండలంలోని గిర్నితండ సంత వద్ద ఆగారు. దేవరుప్పుల మండలంలో పర్యటన ముగించుకొని వెళ్తున్న మంత్రి గిర్నితండ వద్ద ఆగి షాపులకు వెళ్లి ఆత్మీయ పలకరింపులు చేసి సంతలోని వ్యాపారులు, ప్రజలను పలకరించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సెలూన్ షాపులో కటింగ్ చేయించుకొని వెళ్లిపోయారు. ఎంపీపీ జ్యోతి, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ధరావత్ వెంకన్న, కార్యకర్తలు మంత్రి వెంట తిరిగారు.

బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా శ్రీరాములు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ నాగరబోయిన శ్రీరాములును బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. శ్రీరాములు శుక్రవారం హన్మకొండలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రమేష్

జనగామ రూరల్ : జిల్లా ఉత్తమ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా జైన రమేష్‌కు శుక్రవారం అవార్డును ప్రదానం చేశారు . హన్మకొండలోని శ్రీరామానుజ కాన్సెప్ట్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ 320-ఎఫ్ 2021-22 సంవత్సరం ఏర్పాటు చేసి అవార్డ్ నైట్‌లో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. జిల్లాలో 80 క్లబ్‌లకు గాను ఉత్తమ అవార్డుగా జనగామకు వచ్చినట్లు వారు తెలిపారు. జిల్లా గవర్నర్ విద్యాసాగర్‌రావు అవార్డును అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్ : జిల్లా పంచాయతీరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వసంత, డీఎల్‌పీఓలు పార్థసారధి, వెంకటప్రసాద్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడెపాక అనిల్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామాభివృద్ధికోసం ప్రత్యేక నిధులను మంజూరు చేయాలంటూ శుక్రవారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామనాయకులు ఎమ్మెల్యే రాజయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక నిధుల విషయంలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ పోలేపల్లి రంజిత్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంశీ,రమేష్‌నాయక్, మాధవరెడ్డి, రమేష్, రవి ఉన్నారు.

కంటివెలుగు ఫ్లెక్సీల ఏర్పాటు

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కంటివెలుగు కార్యక్రమం విజయవంతానికి మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి సముచిత స్థానం

చిల్పూరు : వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం సర్పంచ్ బొట్టు మానస, మార్కెట్ డైరెక్టర్ శ్యాంసుందర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వేల్పుల గట్టయ్యల ఆధ్వర్యంలో శ్రీధర్‌రావు సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ నుంచి దేవర వెంకటేష్, ఉమ్మగోని శంకర్, అశోక్, రాజు, రాజేష్, జీడి మహేందర్, రాజు, రవీందర్, యాదగిరి, కొంరయ్యలు చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కుర్చీల బహూకరణ

నర్మెట : మండలంలోని వెల్దండ అంగన్‌వాడీ కేంద్రాలకు నిమ్మ రంగమ్మ-రాజిరెడ్డిల జ్ఞాపకార్థం వారి మనుమరాలు భావనారెడ్డి శుక్రవారం 16 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్రా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వస్తున్న గర్భిణులు, బాలింతలకు నేలపై కూర్చోవడం ఇబ్బందిగా మారడంతో విషయం తెలుసుకున్న భావనారెడ్డి స్పందించి కుర్చీలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, వాసుదేవరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునిత, పాల్గొన్నారు.

గందరగోళం మధ్య లబ్ధిదారుల ఎంపిక

- తిమ్మంపేట, చీటూరులో 'డబుల్' ఇళ్ల ఎంపికకు గ్రామసభల ఏర్పాటు
- వెల్దండలో లక్కీడ్రా ద్వారా అందజేసిన అధికారులు



జఫర్‌గఢ్ : లబ్ధిదారుల ఎంపికలో మహిళకు నచ్చచెబుతున్న వీఆర్‌ఏ మేకల వెంకటేశ్వర్లు

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేటలో జరిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గందరగోళం మధ్య సాగింది. సర్పంచ్ మంద మల్లేశం అధ్యక్షతన శుక్రవారం జరిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సమావేశానికి ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్, తహసీల్దార్ స్వప్న హాజరయ్యారు. గ్రామంలో పేదలకు పక్కా ఇళ్లు కేటాయించేందుకు ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం పథకం ద్వారా 25 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందులో ఇప్పటి వరకు 8 ఇళ్లు మాత్రమే పూర్తి కావడంతో వాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. 8 ఇళ్లకు గాను ఎస్సీ, ఎస్టీలకు 4 కేటాయించడంతో పాటు బీసీలకు 3 ఇతర కులాలకు 1 చొప్పున కేటాయించారు. అర్హులైన లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో ఉండడం, ఇండ్ల సంఖ్య తక్కువగా ఉండడంతో గందరగోళానికి దారితీసింది. తమకు ఇళ్లు కేటాయించాలంటూ బీసీ కులాలకు చెందిన మహిళలు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్ది సేపు గ్రామ సభకు అంతరాయం కలిగింది. వెంటనే ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ జోక్యం చేసుకొని లబ్ధిదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వచ్చే ఇళ్ల మంజూరు విషయంలో అర్హులైన వారందరికీ తప్పకుండా ఇండ్లు కేటాయించేలా కృషి చేస్తామంటూ వారు హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు శాంతించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనిల్‌బాబు, పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండలంలోని చీటూరులో డబుల్‌బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన గ్రామసభ గందరగోళం మధ్య సాగింది. శుక్రవారం సర్పంచ్ ఐల మల్లేశం అధ్యక్షతన లబ్ధిదారుల ఎంపికకు తహసీల్దార్ అంజయ్య గ్రామసభ నిర్వహించారు. 392 దరఖాస్తులు రాగా అందులో 50 మంది అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. అధికారులు ఇటీవలే సర్వే నిర్వహించగా ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలతో లబ్ధి తదితర అంశాలను పరిశీలించి 62 మందిని గుర్తించారు. వీరిలో 50 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించడంలో గ్రామస్తులు గందరగోళం చేయడంతో లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాకుండా అధికారులు వెనుతిరిగారు. గ్రామసభలో ఎంపీటీసీ సోమలక్ష్మి, బర్ల రమేష్, వార్డు సభ్యులు మంజుల, రేక, హేమలత, మల్లారెడ్డి, ఎల్లయ్య, భాస్కర్, ఆర్‌ఐలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



లింగాలఘణపురం : చీటూరు గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

నర్మెట : మండలంలోని వెల్దండలో ప్రభుత్వం నిర్మించిన 50 డబుల్ బెడ్‌రూం ఇండ్లను లక్కీడ్రా ద్వారా శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు అధిక సంఖ్యలో ఉండటంతో గత రెండేళ్లగా కేటాయింపు వాయిదా పడుతూ వస్తోంది. రెవెన్యూ అధికారులు ఇంటి నంబర్లను కేటాయించి లక్కీడ్రా పద్ధతిన కేటాయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, వీఆర్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి సెల్‌ఫోన్ అప్పగింత



గొర్ల కాపరికి సెల్‌ఫోన్ ఇస్తున్న ఫారెస్టు అధికారి

స్టేషన్‌ఘన్‌పూర్: రోడ్డు పక్కన నాటిన మొక్కలను గొర్రెలు, మేకలు మేశాయని గొర్రెల కాపరి వద్ద సెల్‌ఫోన్ తీసుకున్న ఫారెస్టు అధికారులు ఎట్టకేలకు తిరిగి ఇచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన గొర్రెల కాపరి చాగ భిక్షపతి ఘన్‌పూర్ శివారులో వారం క్రితం గొర్రెలు, మేకలను మేపుతున్నాడు. జీవాలు రోడ్డు పక్కన తమ శాఖ వారు పెట్టిన మొక్కలు మేశాయని ఫారెస్టు అధికారులు కాపరివద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకున్నారు. ఈ విషయమై ఈనెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి సాదం రమేష్ స్పందించారు. బాధిత కాపరితో కలిసి శుక్రవారం స్థానిక ఫారెస్టు ఆఫీస్‌కు వెళ్లగా ఎవరూ లేకపోవడంతో ఘన్‌పూర్ ఫారెస్టు రేంజ్ అధికారి మురళీధర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు పక్కన నాటిన మొక్కలకు రక్షణగా ట్రీగార్డులు ఏర్పాటు చేసుకోవాలే తప్ప కాపరులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, తక్షణమే ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగం చేతుల మీదుగా బాధితుడికి సెల్‌ఫోన్ అందించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం నాయకులు మేకల మల్లేశం, నాగరబోయిన యాదగిరి, సోమన్న పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను పకడ్బందీగా నిర్వహించాలి



జనగామ రూరల్ : పాఠశాలను సందర్శిస్తున్న జెడ్పీ సీఈఓ వసంత

జనగామ రూరల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కంటివెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ వసంత అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబుల్‌కేశవాపూర్‌లో ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆమె వెంట ఎంపీడీఓ హసీం, డాక్టర్ ప్రవీణ్, సర్పంచ్ రేణుక, కార్యదర్శి రేణుక, ఉన్నారు.

చిల్పూరు: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటివెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఎంపీడీఓ పులుగు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీపతిపల్లిలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమంపై సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఎంపీఓ మధుసూదన్, ఉపసర్పంచ్ గొంగిడి అనూరాధకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఆశ వర్కర్లు బాలమణి, లావణ్య, పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



స్టేషన్‌ఘన్‌పూర్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ, రైతు సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: యువత క్రీడల్లో రాణించాలని, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ఘన్‌పూర్ సీఐ ఎ.రాఘవేందర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో డీవైఎఫ్‌ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో లింగనబోయిన సరిత, ఇర్రి క్రిష్ణారెడ్డి, లింగనబోయిన ఎల్లయ్య స్మారకార్థం ఆవాస గ్రామాల సంక్రాంతి క్రీడోత్సవాలను వారు శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ డీవైఎఫ్‌ఐ యువత సమస్యలపై పోరాడుతూనే యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేలా గత 30 ఏళ్లుగా సంక్రాంతి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, కుర్ర ఉప్పలయ్య, శాతపురం రవి, నీరటి సంపత్, శ్రీకాంత్, పరమేష్, శ్రీను, కిష్టయ్య, అనీల్ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

కొడకండ్ల : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ పేరం రాము అన్నారు. వివేకానంద అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండు జిల్లాల స్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలను సర్పంచ్ మధుసూదన్, మార్కెట్ డైరెక్టర్ కుందూరు అమరేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడోత్సవాలను నిర్వహించి క్రీడా స్ఫూర్తిని నిలపాలన్నారు. కార్యక్రమంలో బందు రాము, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురంలో ఇటీవల మృతి చెందిన సిద్దారెడ్డి కుటుంబ సభ్యులకు బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ దూసరి విజయ్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండ ఆంజనేయులు ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. వారి వెంట బీజేపీ సీనియర్ నాయకులు వడగం రాజేశ్, దామోదర్, కొంరయ్య, శ్రీనివాసు, బాలరాజు, ప్రశాంత్, కరుణాకర్, ఉన్నారు.

స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్ : లయన్స్ క్లబ్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్కూల్‌బ్యాగ్స్ పంపిణీ చేశారు. ముందుగా మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి ఆమంచ మధుసూదన్, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం, పటిక పట్టివేత

తరిగొప్పుల : ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక పట్టుబడినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ శుక్రవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు మండలంలోని వాచ్యా తండా గ్రామపంచాయతీ శివారు దేశతండా క్రాస్‌రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించారు. తండాకు చెందిన లావుడ్యా భాస్కర్ తన ద్విచక్ర వాహనంపై 40 కిలోల బెల్లం, 2 కిలోల తరలిస్తుండుగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భాస్కర్‌ను విచారించగా సిద్దిపేట జిల్లా దూళ్మిట్ట మండలం కొండాపూర్‌కు చెందిన భుక్య శ్రీనివాస్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. భాస్కర్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

తరిగొప్పుల : తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన హరిప్రసాద్‌ను బీఆర్‌ఎస్ మండల నాయకులు శుక్రవారం కలిసి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామెర ప్రభుదాస్, మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యులు ముద్దసాని వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిష్టయ్య, మండల యూత్ అధ్యక్షుడు మల్యాల సుధీర్, అధికార ప్రతినిధి లింగం, రాజారాం, సంజీవ పాల్గొన్నారు.

చిన్నమడూరులో అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

దేవరుప్పుల : మండలంలోని చిన్నమడూరు హైస్కూల్‌కు చెందిన 2002-03 సంవత్సరపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయ పలకరింపుతో బాగోగులను తెలుసుకొని స్నేహాన్ని పంచుకున్నారు. గురువులు రవీందర్‌రెడ్డి, మల్లేషమ్, లక్ష్మారెడ్డి, లలిత, నేత, సత్యనారాయణ, ఖాజా, భగవాన్‌రెడ్డి తదితరులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఈదునూరి రవీందర్‌రెడ్డికి రూ.50 వేల వ్యయంతో కూడిన డిజిటల్ మైక్‌సెట్ విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బైరు అనిల్, వంగ అర్జున్, రాంపెల్లి రాజు, దుబ్బాక శ్రీనివాస్, మంగ, సుకన్య, రమాదేవి, రేణుక, సుజాత, సరిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కట్టపై తుమ్మల తొలగింపును ప్రారంభిస్తున్న ఏసీపీ రఘుచందర్

చిల్పూరు: ఎవరో వస్తారు .. ఏదో చేస్తారని చూడకుండా చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని జాతీయ రహదారిలోని పల్లగుట్ట క్రాస్, దేవాదుల రిజర్వాయర్ కట్ట నుంచి దేశాయితండా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలిగించారు. సొంత నిధులతో జేసీబీలతో శ్రీధర్‌రావు చేపట్టగా శుక్రవారం ఏసీపీతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ రూరల్ సీఐలు రాఘవేందర్, సంతోష్‌లు ప్రారంభించారు. సమావేశంలో సర్పంచ్ బొట్టు మానస, ఎంపీటీసీ భూక్య యాదగిరి, నాయకులు గట్టయ్య, అశోక్‌పాల్, రత్నాకర్‌రెడ్డి, బొట్టు చేరాలు, శ్యాంసుందర్‌రెడ్డి, ఆనందం, గోపాల్‌రెడ్డి, చొక్కయ్య, రవీందర్, సంపత్‌రాజు, అనీల్, ఉపేందర్, కృష్ణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గీతకార్మికుడికి ఎల్‌ఓసీ అందజేత

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేటకు చెందిన గీత కార్మికుడు గైని పరమేష్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్జరీ నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్సీ, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ మేరకు రూ 2.50 లక్షల ఎల్‌ఓసీని గురువారం హన్మకొండలో బాధితుడి కుటుంబానికి కడియం శ్రీహరి అందజేశారు.

జనసేన పార్టీని ఆదరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో రాజకీయ మార్పు కోసం జనసేన పార్టీని ఆదరించాలని జనసేన పార్టీ రాష్ట్రనాయకుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గాదె పృథ్వీ అన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇకపై మార్పుకై జనసేన ముందడుగు అనే నినాదంతో ముద్రించిన వాల్‌పోస్టర్లను డివిజన్ కేంద్రంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. యువతను రాజకీయంగా ఆదరించాలన్నారు.

ఎల్లమ్మ జాతరకు రండి

పాలకుర్తి టౌన్ : ఈనెల 16న బమ్మెరలో జరిగే ఆలేటి ఎల్లమ్మ జాతరకు రావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులను బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని గోపాల్‌గౌడ్, జోగు ఆహ్వానించారు. శుక్రవారం వరంగల్ జిల్లాలోని పర్వతగిరిలోని ఆయన నివాసంలో దంపతులను శాలువాతో సన్మానించి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలు, ప్రధానంగా పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్‌పీడీసీఎల్ ఘన్‌పూర్ డీఈ హుస్సేన్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్‌వైర్లకు దూరంగా గాలిపటాలు ఎగురవేయాలని, గాలిపటాలు, దారం విద్యుత్‌వైర్లకు చిక్కుకుని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

ఏసీడీ చార్జీలపై అవగాహన అవసరం

విద్యుత్ బిల్లులపై పడుతున్న ఏసీడీ(అడిషనల్ కన్సంప్షన్ డిపాజిట్)పై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని డీఈ తెలిపారు. ఇది కేవలం డిపాజిట్ మాత్రమేనని, ఒకవేళ వినియోగదారులు కనెక్షన్ రద్దు చేసుకుంటే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారన్నారు. గతంలో 300 యూనిట్లకు పైగా వాడితేనే పీసీడీ డ్యూ వసూలు చేసేవారని, అయితే ఈనెల నుంచి 300 యూనిట్ల లోపు వారికి కూడా వసూలు చేయాల్సి ఉంటుందన్నారు.

నేడు తాటికొండలో ముగ్గుల పోటీలు

స్టేషన్‌ఘన్‌పూర్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని తాటికొండలో ఈనెల 14న మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.3016, ద్వితీయ రూ.2016, తృతీయ బహుమతి రూ.1016 ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 99124 31102, 9676398178 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెంపకందారుల సంక్షేమానికి ప్రాధాన్యం




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి: గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ అన్నారు. శుక్రవారం గొర్రెల, మేకల పెంపకందారుల మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా సంఘం నాయకులతో కలిసి ఆయన జీఎంపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేర్ని ఉషారవి, పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి, జిల్లా డైరెక్టర్ కావటి యాదగిరి, మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండ వెంకటయ్య, రాజు, నాయకులు యాకన్న, రాములు,జంపయ్య, జనార్దన్, ద్యావర యాకయ్య, తదితరులు పాల్గొన్నారు,

గోదా కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

చిల్పూరు: గోదా కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈఓ లక్ష్మీప్రసన్నలు తెలిపారు. చిల్పూరుగుట్ట ఆలయంలో శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన దాతలు వేదవెల్లి దయాకర్-శ్రవంతి, చంద్రప్రకాష్-పావని, చత్తీష్‌ఘడ్ ఎస్పీ అక్షయ్‌కుమార్-మౌమిత దంపతులు ఆలయ చైర్మన్‌తో కలిసి అర్చకులు రవీందర్ శర్మ, కృష్ణామాచార్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదాకల్యాణం శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతందన్నారు. భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పురుగు ఉధృతి నివారణకు చర్యలు చేపట్టాలి




రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ


చిల్పూరు : ప్రస్తుతం యాసంగి వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ చంద్రన్‌కుమార్ సూచించారు. మండలంలోని దేశాయితండాలో శుక్రవారం వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. పిలకదశలో ఈ పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుందని దీన్ని గమనించేందుకు దీపపు ఎర, సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షణ బుట్టలను అమర్చి రెక్కల పురుగులపై నిఘా పెట్టాలన్నారు. పిలక దశలో ఎకరాకు 3 లింగాకర్షణ బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25-30 పురుగులు పడినపుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలి. ప్రధాన పొలంలో 15 రోజుల వయసున్న పిలక దశలో ఉన్న వరిపైరులో కార్బన్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ 4 కిలోలు వేయాలి. వరిపైరును లార్వ దశలో ఉన్న పురుగు ఎక్కువ నష్టపరుస్తున్నట్లు అయితే వెంటనే క్వినాల్‌ఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

సంస్కృతిని కాపాడుకుందాం


- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



జనగామ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రేమలతారెడ్డి



దేవరుప్పుల : కళాశాలలో విజేతలతో అధ్యాపక బృందం



జనగామ: సాన్‌మారియాలో భోగి మంటల సంబురాల్లో యువతులు, మహిళలు

జనగామ : మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే విధంగా వేడుకలను ఘనంగా జరుపుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని జూబ్లీ గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి పండగలో కుటుంబ సభ్యులు నేటి తరం పిల్లలను భాగస్వాములను చేయాలన్నారు. రంగవల్లుల పోటీల్లో మహిళలు పెద్ద ఉత్తన పాల్గొని తమ ప్రతిభను చాటు కున్నారన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2వేల నగదును దశమంతరెడ్డి అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, కౌన్సిలర్ ఉడుగుల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, కౌన్సిలర్లు మహంకాళి హరిచంద్రగుప్త, బొట్ల శ్రీనివాస్, నాయకులు రమేష్, శివరాజ్ యాదవ్, పవన్ శర్మ, మహిపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, హరీష్, శ్రీనివాస్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట : మహిళలు వేసే ముగ్గులు తమ అభిప్రాయాలను ప్రతిభను వెలికితీస్తాయని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోచన్నపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ ఇంటి ముందు వేసే ముగ్గులు ఆ ఇంటి మహిళ హుందాతనాన్ని కలిపించేలా చేస్తాయన్నారు. మొదటి బహుమతి రూ.2వేలు, రెండో బహుమతి రూ.1500. తృతీయ బహుమతి రూ.1000లను అందించారు. పోటీల్లో పాల్గొన్న 20 మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులను ఎస్సై అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, జూకంటి గణేష్, రాజు పాల్గొన్నారు.

దేవరుప్పుల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ అధ్యక్షతన సంక్రాంతి ముందస్తు సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగల్లో సంక్రాంతి పండుగ ఒకటి అన్నారు. పోటీల్లో మొదటి బహుమతి దీపిక, రెండో బహుమతి సిరివెన్నెల, మూడవ బహుమతి సిహెచ్.అక్షయతోపాటు పలువురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అధ్యాపకులు గణేష్ శ్రీనివాస్ ఉదయ్ కుమార్ అరుణాకర్, రాధిక, హరిత, చైతన్య ,రహిమున్నీషా, పాల్గొన్నారు.